క్లుప్తంగా

క్లూస్ టీమ్ పరిశీలన



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని ఈశ్వరనారాయణ కాలనీలో 13 తులాల బంగారం అపహరణకు గురైన విషయం తెలిసిందే. ఈ మేరకు శనివారం ఘటన స్థలానికి క్లూస్ టీమ్ చేరుకుని, పరిశీలించింది. జరిగిన ఘటనపై బాధితుడు సత్యనారాయణ వద్ద ఆరాతీసి, ఘటనాస్థలిలో లభ్యమైన వేలిముద్రలు సహా ఇతర ఆధారాలను సేకరించారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



ఉంగరాడమెట్ట వద్ద వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్ఐ నీలావతి

రేగిడి: మండల వ్యాప్తంగా పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. మండలంలోని ఉంగరాడమెట్ట, బూరాడ, చిన్నశిర్లాం జంక్షన్ల వద్ద వాహన తనిఖీలు శనివారం చేపట్టి, వాహనదారుల లైసెన్స్, వాహనాల ధ్రువపత్రాలను పోలీసులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని తెలిపారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు వాహన ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలన్నారు.

తాగునీరు వృథా చేయొద్దు



సంకిలిలో కుళాయిల పనితీరును పరిశీలిస్తున్న జేఈ శ్రీచరణ్

రేగిడి: మండలంలోని సంకిలి, బొడ్డవలస, ఉంగరాడ గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ తాగునీటి పైపులైన్లను ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ శనివారం పరిశీలించారు. తాగునీటి కుళాయిలను సద్వినియోగం చేసుకోవాలని, ఎప్పుడూ తాగునీరు వృథా చేయవద్దని సూచించారు. చిన్నచిన్న మరమ్మతులకు గురైతే తమకు వెంటనే తెలియజేయాలని, కుళాయిలు బాగుచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సంకిలి పంచాయతీ సర్పంచ్ బుడుమూరు పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

దీపోత్సవం

బొబ్బిలి: పట్టణంలోని అతిపురాతన ఆలయమైన రుక్మిణీ సహిత వేణుగోపాలస్వామి ఆలయంలో దీపోత్సవం శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ దీపోత్సవాన్ని కృత్తిక దీపోత్సవంగా పిలుస్తారని, ఇది ఎంతో పవిత్రమైనదని పురోహితులు తెలిపారు.

జాగ్రత్తలు పాటిస్తే టీబీ దూరం



అవగాహన కల్పిస్తున్న టీబీ కంట్రోల్ సూపర్ వైజర్ లలిత

చీపురుపల్లి: ముందస్తు జాగ్రత్తలు పాటించడం వల్ల టీబీ వ్యాధికి దూరంగా ఉండవచ్చని టీబీ కంట్రోల్ సూపర్‌వైజర్ జి.లలిత చెప్పారు. టీబీ నివారణపై మండలంలోని పర్ల గ్రామస్తులకు శనివారం అవగాహన కల్పించారు. ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో టీబీ నివారణపై వంద రోజుల అవగాహన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యాధికి సంబంధించి ఎక్స్‌రే, టీబీ పరీక్షలు ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా నిర్వహిస్తామని చెప్పారు. టీబీ వ్యాధి సోకకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రతినెలా రూ.వెయ్యి చొప్పున ప్రభుత్వం అందజేస్తున్నట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



రైతులకు సూచనలిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారి హేమసుందర్

బొండపల్లి: ప్రకృతి వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం రీజనల్ అధికారి జి.హేమసుందర్ అన్నారు. మండలంలోని కొత్తపాలెంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా అపరాల పంటల సాగుపై శనివారం అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, ఆరోగ్యవంతమైన పంట కావాలంటే ప్రకృతి సాగు బాట పట్టాలని ఆయన తెలిపారు.

పశుపోషణ భారం



- యంత్రాల వినియోగంతో ఎండుగడ్డి కొరత
- విపరీతంగా పెరుగుతున్న దాణా ఖర్చులు
- మరోవైపు జీవాలను వేధిస్తోన్న వ్యాధులు
- తగ్గుతున్న పాల దిగుబడి
- ఆందోళనలో పాడిరైతులు

దాణా రేట్లు ఇలా..

దాణా రకం	ధర
తవుడు(50 కిలోలు):	రూ.1400
నూకలు(పెద్దవి 50 కిలోలు):	రూ.1200
నూకలు(చిన్నవి 50 కిలోలు):	రూ.1100
బఠాణీ బొత్తు(20 కిలోలు ఎ-1రకం):	రూ.1200
బఠాణీ పిండి(50 కిలోలు):	రూ.1500
మినప పొట్టు(50 కిలోలు):	రూ.1250
పెసరపొట్టు(50 కిలోలు):	రూ.1200
ట్రాక్టరు వరిగడ్డి(గతంలో):	రూ.5500



ఇలా యంత్రాలతో వరికోతలు చేపడుతుండడంతో గడ్డి దొరకని పరిస్థితి..

రాజాం సిటీ: పాడిరైతుకు పశుపోషణ భారమైంది. వ్యవసాయంలో యాంత్రీకరణ(యంత్రాల వినియోగం) కారణంగా ఎండుగడ్డి అంతగా దొరకని పరిస్థితి ఏర్పడింది. దీంతో పాటు విపరీతంగా పెరిగిన దాణా ఖర్చులు ఓ వైపు.. జీవాలను నిత్యం వేధించే రకరకాల వ్యాధులు మరోవైపు.. పశుపోషకులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పశుగ్రాసం కొరతతో జీవాలు బక్కచిక్కిపోయి ఫలితంగా పాల దిగుబడి తగ్గిపోతోందని పాడిరైతులంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో పశువులు పెంచేందుకు ఎవరూ అంతగా ఆసక్తి కనబరచడం లేదు. రాజాం పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లోనూ వ్యవసాయంలో ఏటా యంత్రాల వినియోగం పెరుగుతుండడంతో ఎండుగడ్డి కొరత ఏర్పడుతోంది. ఎక్కడో ఓ చోట దొరికే కాస్త ఎండుగడ్డికి మంచి డిమాండ్ ఏర్పడుతుండడంతో కొంతమంది పశు యజమానులు గడ్డిని కూడా కొనుగోలు చేయలేని దుస్థితి తలెత్తుతోంది. ఓ వైపు దాణా ఖర్చులు, మరోవైపు ఎండుగడ్డి ఖర్చు భారంగా మారడంతో పశుపోషణ ఎలా అని పాడిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం దాణా ఖర్చుల భారమైనా లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అభ్యర్థిస్తున్నారు.

రాజాం నియోజకవర్గంలో పాడి పశువులు ఇలా..

మండలం	పాడి పశువులు (ఆవులు, గేదెలు)
రాజాం	7800
రేగిడి	8200
వంగర	8600
సంతకవిటి	7400

ఇష్టారాజ్యంగా ధరలు..

పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారు నానాపాట్లు పడాల్సి వస్తోంది. రైతులంతా పశువుల కోసం ఎండుగడ్డితో పాటు తవుడు, నూకలు, బఠాణీ బొత్తు, పెసర బొత్తు, మినప పొట్టు తదితర వాటిని వినియోగిస్తున్నారు. వీటినే ఆసరాగా చేసుకుని వ్యాపారులు ఇష్టారాజ్యంగా వాటి ధరలు పెంచుకుంటూ పోతున్నారు. దీంతో పాడిరైతులు చేసేదేమీలేక తప్పనిసరి పరిస్థితుల్లో వారి పెంచిన ధరకే దాణా కొనుగోలు చేయాల్సి వస్తోంది. పాలసేకరణ కేంద్రాల్లో పాల ధరలు తక్కువగా ఇస్తున్నప్పటికీ దాణా మాత్రం ఎంత ఎక్కువైనా తప్పకుండా కొనుగోలు చేసి వేయాల్సి వస్తోందని, లేకపోతే ఆ వచ్చే పాలు కూడా పశువుల నుంచి సక్రమంగా రావని పాడిరైతులు వాపోతున్నారు. శీతాకాలంలో పాడి పశువులకు వేడిపుట్టి పాల దిగుబడి రావాలంటే ఇటువంటి దాణాలు వేయాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. పశుసంవర్ధక శాఖ అధికారులు స్పందించి, ప్రభుత్వం ద్వారా దాణా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పాడి కలిసిరావడం లేదు..

ఒకప్పుడు కలిసొచ్చిన పాడి పరిశ్రమ ప్రస్తుతం కలిసిరావడం లేదు. ఓ పక్క మేతలు లేక.. మరోపక్క వ్యాధులు భయంతో ఇబ్బందులు పడుతున్నాం. దాణాల రేట్లు బాగా పెరిగిపోయాయి. అయినా పాలవ్యాపారంతో కుటుంబం పోషించుకోవచ్చన్న ఆశతో దాణా కొనుగోలు చేసి, వినియోగిస్తున్నాం. ఇదే అదనుగా వ్యాపారులు దాణా ధరలు పెంచేస్తున్నారు.

–శాసపు సత్తిబాబు, పాడిరైతు, పొనుగుటివలస గ్రామం

సబ్సిడీపై దాణా అందించాలి..

ప్రస్తుతం దాణా ఖర్చుల భారమవుతున్నందున ప్రభుత్వమే సబ్సిడీపై దాణా అందించాలి. అలాగే సకాలంలో పశువైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి. పాల దిగుబడి పెరగాలంటే పశువులకు తగినంత పౌష్టికాహారం అందివ్వాలి. ప్రభుత్వ సహకారం ఉంటే బాగుంటుంది.

–ఎ.వెంకటేష్, పాడిరైతు, రాజాం

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



యువతకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ప్రసాదరావు

రామభద్రపురం: యువత, విద్యార్థులంతా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ వి.ప్రసాదరావు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై యువతకు శనివారం అవగాహన కల్పించారు. గంజాయి, కొకైన్, హెరాయిన్, ఖైనీ, గుట్కా, సిగరెట్, మద్యం వంటి మత్తు పదార్థాల వల్ల జీవితం నాశనమవుతుందని, ఎంతోమంది వీటికి బానిసలై తమ బంగారు భవిష్యత్ చెడగొట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం సేవించి, వాహనాలు డ్రైవ్ చేయడం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ద్విచక్ర వాహనదారులంతా హెల్మెట్ ధరించాలన్నారు. అనంతరం సత్ప్రవర్తనతో మెలగుతామని యువతతో ప్రతిజ్ఞ చేయించారు.

నీటి సంఘాల ఎన్నికల్లో స్వల్ప ఘర్షణలు



రామభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘర్షణ పడుతున్న టీడీపీ నేతలు

రామభద్రపురం: మండలంలో శనివారం జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి నేతల మధ్య స్వల్ప ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ ఎన్నికలకు వైఎస్సార్ సీపీ దూరంగా ఉండడంతో కూటమి నేతల మధ్యే ప్రధానంగా పోటీ నెలకొంది. మండలంలోని ఐదు సాగునీటి సంఘాల్లో మీడియం పెద్దగెడ్డ ప్రాజెక్టుకు సంబంధించి, కొట్టక్కి డబ్ల్యూఎ-5లో 12 టీసీలకు గాను నాలుగు ఏకగ్రీవం కాగా, ఎనిమిదికి చేతులెత్తడం ద్వారా ఎన్నుకున్నారు. ఈ సంఘం ప్రెసిడెంట్‌గా ఎం.జగదీశ్వరరావును ఎన్నుకున్నారు. అలాగే రామభద్రపురం డబ్ల్యూ-6కి సంబంధించి, 12 టీసీలకు గాను 11 ఏకగ్రీవం కాగా ఒకదానికి చేతులెత్తి డైరెక్టర్‌ను ఎన్నికున్నారు. ఈ సంఘం ప్రెసిడెంట్‌గా పూడి రామనాయుడును ఎంపిక చేసుకున్నారు. మైనర్ ఇరిగేషన్ కొట్టక్కి నేరెళ్లగెడ్డ సంఘానికి 6 టీసీలకు 4 ఏకగ్రీవం, ఒకటి చేతిలెత్తి, ఒకటి ఓటింగ్ ద్వారా ఎంపిక జరిగింది. కొండకెంగువ ఏడొంపులగెడ్డ సాగునీటి సంఘానికి సంబంధించి ఆరు టీసీలకు గాను ఆరూ ఏకగ్రీవమయ్యాయి. ఈ సంఘానికి తాడ్డి శ్రీనివాసరావును ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. పాతరేగ ఎర్కరిగెడ్డ సంఘానికి సంబంధించి 6 టీసీలకు గాను అన్నీ ఏకగ్రీవం కాగా పెద్దింటి పైడిపునాయుడు ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నట్లు సాగునీటి సంఘం ఎన్నికల అధికారి తహసీల్దారు సులోచనరాణి తెలిపారు.

తెర్లాం: మండలంలోని 18 సాగునీటి సంఘాలకు శనివారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని అన్ని సాగునీటి సంఘాల ఎన్నికల్లో అధ్యక్ష, ఉపాధ్యక్షులను, సభ్యులను ఓటు హక్కుఉన్న రైతులంతా ఏకగ్రీవంగానే ఎన్నుకున్నారు.

మెంటాడ: మండలంలో మూడు మధ్యతరహా, 11 చిన్న తరహా నీటిసంఘాలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో 13 నీటి సంఘాల ఎన్నిక ఏకగ్రీవం అయ్యాయి.

బాడంగి: మండలంలో 9 మైనర్ ఇరిగేషన్, 2 మీడియం ఇరిగేషన్ పరిధిలోని నీటి సంఘాల ఎన్నికలు శనివారం జరిగాయి.



కొట్టక్కి పాఠశాలలో ఘర్షణ పడుతున్న టీడీపీ నేతలను ఓదార్చుతున్న ఎస్ఐ ప్రసాదరావు

బాడంగి: మండలంలోని రేజేరు బొమ్మినాయుడు చెరువుకు శనివారం జరిగిన నీటి సంఘ ఎన్నికల్లో గ్రామానికి చెందిన బొమ్మినాయుని తిరుపతిరావు ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వాయిదా..

రాజాం సిటీ: మండలంలోని ఆగూరులో నిర్వహించిన సాగునీటి ఎన్నిక కోరం లేకపోవడంతో వాయిదా పడిందని తహసీల్దారు ఎస్.కె.రాజు తెలిపారు. మండలంలో 27 సాగునీటి సంఘాలకు గాను 26 సంఘాలకు ఎన్నిక ఏకగ్రీవమైంది.

వంగర: మండలంలోని నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్య ఎన్నికల ప్రక్రియ శనివారం ప్రశాంతంగా జరిగింది. మండలంలో 8 నీటి సంఘాలకు గాను ఎనిమిదీ ఏకగ్రీవంగానే ఎన్నుకున్నట్లు తహసీల్దారు డి.ధర్మరాజు తెలిపారు. ఆయా సంఘాల అధ్యక్షులకు ఎన్నిక పత్రాన్ని ఎన్నికల అధికారులు అందించారు.

రేగిడి: మండలంలో ఎంఆర్‌పీ పరిధిలో నాలుగు, మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించి పది నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల నోడల్ అధికారి నాగేశ్వరరావు ఏవీపురం, ఉనుకూరు, ఖండ్యాం తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలు పరిశీలించారు. ఎన్నికల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎస్ఐ పి.నీలావతి సిబ్బందితో పర్యవేక్షించారు.

17న పెన్షనర్ల దినోత్సవం

రాజాం: స్థానిక ప్రభుత్వ పెన్షనర్ల సంఘ కార్యాలయం వద్ద ఈ నెల 17వ తేదీన అఖిల భారత పెన్షనర్ల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు నారాయణశెట్టి గౌరీశంకరరావు, ప్రధాన కార్యదర్శి డోల అప్పలనాయుడు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. పెన్షనర్లంతా ఈ కార్యక్రమానికి హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఉచిత కంటివైద్య శిబిరం

మెంటాడ: మండలంలోని పెదమేడపల్లి సచివాలయం వద్ద ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి డీజీఎం కె.బంగార్రాజు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లోక్ అదాలత్‌లో 714 కేసుల పరిష్కారం

బొబ్బిలి: స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 714 కేసులు పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జె.సౌమ్యజోసెఫ్, లక్ష్మీ దీపవల్లి, పి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ప్రతిభ

రాజాం సిటీ: రాష్ట్ర స్థాయి తెలుగు ప్రతిభా పరీక్షలో స్థానిక సన్ స్కూల్ విద్యార్థి ప్రతిభ కనబరిచించిందని ప్రిన్సిపాల్ భారతి శనివారం తెలిపారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా మన సంస్కృతి పేరిట ఆన్‌లైన్‌లో ఈ పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన సింహాద్రి సాయిశ్రీ చరిష్మ ఉత్తమ ప్రతిభ కనబరిచి, తృతీయ స్థానం సాధించడం అభినందనీయమన్నారు.

తగ్గేదేలే..



రూ.190 కొత్త స్టిక్కరు తొలగించి దాని కింద ధర రూ.220కు విక్రయిస్తున్న మద్యంసీసా

బొబ్బిలి: ప్రభుత్వం మూడు రకాల మద్యం బ్రాండ్‌ల ధరలు తగ్గించామని చెబుతున్నా మద్యం వ్యాపారులు మాత్రం వాటి ధరలు తగ్గించకుండా పాత ధరలకే విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో మందుబాబులు లబోదిబోమంటున్నారు. పాతధరపై కొత్త ధర స్టిక్కర్లు అతికించి మరీ కంపెనీలు పంపిస్తుంటే.. వ్యాపారులు మాత్రం కంపెనీ అతికించిన కొత్త ధర స్టిక్కరు(తగ్గించిన ధర స్టిక్కరు) తీసేసి, పాత ధర స్టిక్కరు(ఎక్కువ ధర/పాత ధర) చూపిస్తూ అమ్మేస్తున్నారు. కొనుగోలుదారులు ప్రశ్నించినా తగ్గేదేలే అన్నట్లు వ్యాపారులు వ్యవహరిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు స్పందించి, అక్రమ వ్యాపారాలపై చర్యలు తీసుకోవాలని పులువురు కోరుతున్నారు.

తప్పిన ప్రమాదం



రాజాం పట్టణ ప్రధాన రహదారిలో ఓ పెద్ద ప్రమాదం తప్పింది. శుక్రవారం అర్ధరాత్రి హర్యానా నుంచి గాజు అద్దాల లోడుతో శ్రీకాకుళం వైపు వెళ్తున్న ఓ భారీ లారీ ఎల్ఐసీ భవనం ఎదురుగా ఉన్న రోడ్డు మధ్యలోని డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. డివైడర్ పైనుంచి వేగంగా లారీ దూసుకెళ్లడంతో డివైడర్ సహా చెట్లు, వీధిలైట్ స్తంభం పూర్తిగా ధ్వంసమయ్యాయి. అదే సమయంలో వాహనదారుల రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పిందని, అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని స్థానికులు చెబుతున్నారు. డ్రైవరు నిద్రలోకి జారుకోవడంతోనే ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

–రాజాం

విద్యుత్ స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించండి



విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ప్రజలంతా వ్యతిరేకించాలని సీపీఎం మండల కన్వీనర్ గోపాలం పిలుపునిచ్చారు. ఇదే విషయమై ఆయన మండలంలోని రంగరాయపురంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వాల్‌పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. వ్యాపారవేత్త అదానీకి సంబంధించిన విద్యుత్ స్మార్ట్‌మీటర్లను వినియోగిస్తే రీచార్జ్ చేసుకుంటేనే ఇంటికి విద్యుత్ సరఫరా ఉంటుందని, ఒక్కరోజు ఆలస్యమైనా అంధకారమేనన్నారు. అలాగే రూ.16 వేల కోట్ల విద్యుత్ ట్రూఅప్ చార్జీల భారం ప్రజలపై పడనుందని, దీనిపై మనమంతా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

–బొబ్బిలిరూరల్

క్రిస్మస్ కాంతులు



క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకుని, చర్చిలు ముస్తాబవుతున్నాయి. ముఖ్యంగా బొబ్బిలి పట్టణంలోని 133 ఏళ్ల చరిత్ర కలిగిన సీబీఎం చర్చి విద్యుత్ దీపాల అలంకరణలో మెరిసిపోతోంది. విద్యుత్ కాంతులీనుతూ అత్యంత సుందరంగా కనిపిస్తున్న ఈ చర్చిని రాత్రిపూట చూసేందుకు సందర్శకులు పోటెత్తుతున్నారు. ఈ నెల 25వ తేదీన క్రీస్తు పుట్టినరోజు సందర్భంగా ఏటా క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తుండగా, ప్రస్తుతం అన్నిచోట్ల పండగ సందడి నెలకొనడం విశేషం.

–బొబ్బిలి

చురుగ్గా 'ఉపాధి' పనులు



రాజాం సిటీ: వేతనదారుల మస్తర్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రేగిడి: మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. అప్పాపురం, మజ్జిరాముదుపేట, గోపింపేట తదితర గ్రామాల్లో ప్రస్తుతం పనులు జరుగుతుండగా, ఆ పనులను ఏపీవో ఎస్.హరనాధరావు పరిశీలించి, వేతనదారులకు పలు సూచనలు చేశారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు.

రాజాం సిటీ: మండల పరిధిలోని అంతకాపల్లి ఫీడర్ చానల్‌లో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో వి.శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు చేపడితే రోజుకు రూ.300లు వేతనం అందుతుందన్నారు.

అన్ని పంచాయతీల్లోనూ ప్రారంభించాలి..

రాజాం: ఉపాధి వేతనదారులు వలస వెళ్లకుండా అన్ని గ్రామాల్లోనూ ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పలు పంచాయతీలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశమైన ఆయన.. ప్రతిరోజూ వేతనదారుల సంఖ్య పెరిగేలా చూడాలని, వారికి కనీస వేతనం అందేలా దృష్టిసారించాలని తెలిపారు. అనంతరం గ్రామాల వారీగా గోకులాలు, పల్లె పండగల పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో ఏపీవో సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



రేగిడి: అప్పాపురం వద్ద పనులు చేస్తున్న వేతనదారులు